క్లుప్తంగా

అరుణాచలంకు ప్రత్యేక బస్సులు

ఆత్మకూరురూరల్: ఈనెల 27న సోమవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలం వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని డిపో మేనేజరు కరీమున్నీసా, సీఐ కల్పన బుధవారం తెలిపారు. ఈ నెల 26న ఉదయం 8 గంటలకు తొలి సూపర్‌లగ్జరీ బస్సు ఆత్మకూరు నుంచి అరుణాచలం బయలు దేరుతుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఇప్పటికే ఆ బస్సు రిజర్వేషన్ పూర్తయినందున, రెండో బస్సు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. రానుపోనూ టికెట్ ధర రూ.1400 నిర్ణయించామన్నారు. మార్గమధ్యంలో కాణిపాకం, సిరిపురం, అరుణాచలం గిరి ప్రదర్శన, తదితర ప్రదేశాలను సందర్శించవచ్చన్నారు. పూర్తి వివరాల కోసంకు డిపో మేనేజర్ 99592 25645, సీఐ 99660 09395 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మురగళ్లలో అభివృద్ధి పనులు ప్రారంభం



మురగళ్లలో కల్వర్టు నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

ఆత్మకూరురూరల్: మండలంలోని మురగళ్లకు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మంజూరు చేయించిన అభివృద్ధి పనులను బుధవారం ప్రారంభించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్, గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో ఈ పనులు చేపట్టి గ్రామానికి అవసరమైన రెండు కల్వర్టులు నిర్మిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్ తోడేటి అశోక్ తెలిపారు.

24న బైక్ వేలం

ఆత్మకూరు: ఆత్మకూరు పోలీసుస్టేషన్ పరిధిలో కేసులో పట్టుబడిన ఓ బైక్‌ను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 24న శుక్రవారం వేలం నిర్వహించనున్నట్లు ఎస్సై ముత్యాలరావు బుధవారం తెలిపారు. హీరోహోండా మోటారు సైకిల్‌కు దరావత్తుగా రూ.1800 చెల్లించి వేలంలో పాల్గొనవచ్చునని తెలిపారు. వేలం ముగిసిన అనంతరం పూర్తి నగదు చెల్లించి వాహనాన్ని స్వాధీనం చేసుకోవచ్చునన్నారు.

పోలేరమ్మ ఆలయంలో చోరీ



పొలాల్లో వదిలి వేసిన హుండీ

వరికుంటపాడు: మండలంలోని యర్రంరెడ్డిపల్లి శివారులో ఉన్న గ్రామదేవత పోలేరమ్మ ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. జన సంచారం లేని గ్రామ శివారులో ఆలయం ఉండడంతో గుర్తుతెలియని వ్యక్తులు లోనికి ప్రవేశించి హుండీని అపహరించుకుని వెళ్లారు. సమీపంలోని పొలాల్లో పగులగొట్టి అందులోని కానుకలను తీసుకుని హుండీని అక్కడే వదిలేశారు. ఉదయం అటు వైపుగా వెళ్లిన గ్రామస్తులు హుండీని గుర్తించారు. చోరీ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు.

తక్కువ కాలంలో పండే వరి రకాల సాగు చేయండి



మాట్లాడుతున్న ఏఓ

అల్లూరు: ప్రస్తుతం నీటి వనరులను బట్టి తక్కువ కాలంలో పండే వరి రకాలను రైతులు సాగు చేయాలని ఏఓ వి.అశోక్ తెలియజేశారు. స్థానిక ఏఓ కార్యలయంలో రైతులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ తక్కువ కాలంలో పండే వరివంగడాలు ఎన్ఎల్ఆర్-34449, కేఎన్ఎం-1638, కేఎన్ఎం-733, ఎన్ఎల్ఆర్-3354, ఆర్ఎన్ఆర్-15048 రకం వరి వంగడాలు 120 రోజుల్లో దిగుబడి వస్తాయన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు వాసికి డాక్టరేట్



డాక్టర్ ఎద్ల పెంచలయ్య

ఆత్మకూరురూరల్: మండలంలోని బసవరాజుపాళెంకు చెందిన ఎద్ల పెంచలయ్యకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం కోఆర్డినేటర్ డాక్టర్ కిరణ్మయి డాక్టరేట్ ప్రకటించింది. 'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బౌద్ధమత భావన, సమకాలిన అభ్యాసానికి శాస్త్రీయ సిద్ధాంతం'పై పరిశోధనకు తనకు డాక్టరేట్ లభించిందన్నారు. యూకో బ్యాంకు సీనియర్ మేనేజరుగా పనిచేసిన ఆయన ఇప్పటికే 12 మాస్టర్ డిగ్రీలు, ఒక ఎంఫిల్, మరొక పీహెచ్‌డీ కలిగి ఉన్నారు.

'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే'

కులమతాలకు, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి కుటుంబానికి నవ రత్నాల పథకాలతో ప్రభుత్వ సంక్షేమ ఫలాల లబ్ధి చేకూర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దక్కుతుంది. పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. తద్వారా ప్రజలకు నేరుగా సంక్షేమ పథకాలు చేరువయ్యాయి. ముఖ్యమంత్రి అందజేసిన సంక్షేమ పథకాల్లో 80 శాతానికి పైగా మహిళల ఖాతాల్లో నేరుగా జమ చేశారు. కరోనా వంటి సంక్షోభ సమయంలో సైతం సంక్షేమాన్ని ఆపలేదు. గత ప్రభుత్వ పాలనలో పడకేసిన అభివృద్ధి కార్యక్రమాలు కూడా వేగంగా కొనసాగిస్తున్నారు. ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రిగా మళ్లీ జగనన్నే కోరుకుంటున్నారు.



మర్రిపాడు: డీసీపల్లిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్నపార్టీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, గ్రామ సర్పంచ్ రేవూరు సుప్రజ, సొసైటీ చైర్మన్ సోమల మాధవరెడ్డి, నాయకులు నరసారెడ్డి, చెవుల శ్రీనివాసులు తదితరులు



కలిగిరి: గంగిరెడ్డిపాళెంలో బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న మేకపాటి అభినవ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కాటం రవీంద్రారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పోలు చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఓబుల్‌రెడ్డి తదితరులు



చేజర్ల: నాగులవెలటూరులోబోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ తూమాటి విజయభాస్కరరెడ్డి, జెడ్పీటీసీ పార్థసారధి, జేసీఎస్ కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఏలూరు తిరుపతినాయుడు, నాయకులు ఓబయ్యానాయుడు, రవీంద్రనాయుడు, మస్తాన్‌రెడ్డి తదితరులు



ఆత్మకూరురూరల్: బోయలచిరివెళ్లలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న మండల జేసీఎస్ కన్వీనర్ వల్లభనేని రాజేంద్ర, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి అంకయ్య, స్థానిక సర్పంచ్ బొలిగర్ల వెంకటేశ్వర్లు, నాయకులు శ్రీనివాసులు రెడ్డి, జనార్దన్ రెడ్డి, జగన్ తదితరులు



సోమశిల: బొమ్మవరం అగ్రహారంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, మండల సచివాలయ కన్వీనర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, ఎంపీటీసీ అక్కలరెడ్డి కొండారెడ్డి, ఉప సర్పంచ్ నారాయణరెడ్డి తదితరులు



కొండాపురం: సాయిపేట సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ యల్లావుల వెంకట్రావు, మండల అధ్యక్షుడు చిమ్మిలి రవీంద్ర, సచివాలయ కన్వీనర్ యారం నరసింహారావు, గుడవల్లూరు సొసైటీ అధ్యక్షుడు కర్తం శ్రీనివాసులరెడ్డి, నేతలు పొన్నూరి తిరుపతయ్య, ఆళ్ల వెంకటేశ్వర్లు తదితరులు

సోమశిలలో కార్తీక వనభోజనాలు

సోమశిల: ఆత్మకూరు సీమ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమశిల కామాక్షి సమేత సోమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో డిసెంబర్ 3న కార్తీక వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కార్యవర్గ అధ్యక్షుడు మేళ్లచెరువు శివకుమార్‌శర్మ తెలిపారు. ఆయన సోమేశ్వరుడిని దర్శించుకున్న బ్రాహ్మణ సంఘం సభ్యులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దాదాపు నాలుగు దశాబ్దాల కాలంగా వనభోజనాలు, సామూహిక ఉచిత ఉపనయన తదితర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సోమేశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కామాక్షమ్మ తల్లికి సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సోమేశ్వరాలయ అర్చకులు అన్నవరం రామకృష్ణశాస్త్రి, వాకాటి మురళీకృష్ణమాచార్యులు, లోకా సత్యనారాయణ శర్మ, సొట్టు శశికళాధర్‌శర్మ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మేళ్ల చెరువు శివకుమార్‌శర్మ

ప్రకృతి వ్యవసాయంతో నిరంతర ఆదాయం

ఆత్మకూరురూరల్: ప్రకృతి వ్యవసాయంలో ఏటీఎం మోడల్ విధానాల ద్వారా తక్కువ విస్తీర్ణంలో కూరగాయలు, తీగ జాతి ఆకుకూరలు పండించి నిరంతర ఆదాయం పొందవచ్చునని జిల్లా ప్రకృతి వ్యవసాయం సాంకేతిక సమన్వయకర్త రవిచంద్ర ప్రసాద్ అన్నారు. మండలంలోని కరటంపాడులో బుధవారం ఏటీఎం మోడల్ పంటల సాగును ఆయన క్షేత్ర పరిశీలన చేశారు. ఆయన మాట్లాడుతూ కొద్దిపాటి నీటి వసతి కలిగిన 20 సెంట్ల పొలంలో 20 రకాల పంటలు పండించవచ్చన్నారు. పంట సాగు చేపట్టిన 20 రోజుల నుంచి రైతులు నిరంతర ఆదాయం పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో అనంతపురం జిల్లా కేంద్రం నుంచి విచ్చేసిన అధికారి సురేంద్రరెడ్డి, ఆత్మకూరు మండలానికి చెందిన ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సుబ్బరాయుడు, వీరనారాయణ, ప్రసాద్, శ్రీనివాసులు, పద్మ, దొరసానమ్మ, తదితరులు పాల్గొన్నారు.



కూరగాయల పంటల సాగును పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు, రైతులు

విజేతలకు బహుమతుల ప్రదానం



మర్రిపాడు: బహుమతులతో విద్యార్థులు



ఏఎస్‌పేట: విద్యార్థులకు బహుమతుల ప్రదానం

మర్రిపాడు: గ్రంథాలయ వారోత్సవాల్లో నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బుధవారం కేజీబీవీ, జెడ్పీ హైస్కూళ్లలో ఇన్‌చార్జి లైబ్రేరియన్ దివానపు నారాయణరావు ఆధ్వర్యంలో బహుమతి ప్రదానం చేశారు. బుధవారం వారోత్సవాల ముగింపు కార్యక్రమాలను నిర్వహించారు. కేజీబీవీలో ఎస్‌ఓ లక్ష్మీదేవిని గ్రంథాలయ శాఖ తరఫున సత్కరించారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కస్తూర్బా విద్యాలయం ప్రిన్సిపల్ పీ శ్రీలక్ష్మమ్మ మాట్లాడుతూ పుస్తక పఠనం మంచి అలవాటు అని, చిన్ననాటి నుంచి నీతి కథలు, భక్తి కథలు చదవడం ద్వారా ఊహా శక్తి విషయ పరిజ్ఞానంతో పాటు నైతిక విలువులు పెంపొందుతాయని తెలిపారు ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు లైబ్రేరియన్ ఓ శ్రీనివాసరాజు స్పోకెన్ ఇంగ్లిష్, పెద్ద బాలశిక్ష పుస్తకాలను బహుమతులుగా అందజేశారు.



చేజర్ల: బహుమతులు అందుకున్న విద్యార్థులు

చేజర్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ కల్పన పాల్గొన్నారు.

సిబ్బంది డ్రెస్ కోడ్ పాటించాలి

వరికుంటపాడు: గ్రామ సచివాలయాల్లో పనిచేసే సిబ్బంది డ్రెస్ కోడ్ తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీఓ చేవూరి శ్రీదేవి అన్నారు. ఆమె బుధవారం మండలంలోని వేంపాడు, తిమ్మారెడ్డిపల్లి సచివాలయాలను తనిఖీ చేశారు. ఆమె రికార్డులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సచివాలయ సేవలను అందించాలన్నారు. క్షేత్ర స్థాయికి వెళ్లేటప్పుడు మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. నూరు శాతం బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు. కులగణన సర్వేను బాధ్యతగా నిర్వహించాలన్నారు. ప్రతి రోజు స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించాలన్నారు. సచివాలయ సేవలు విస్తృత పరచాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీదేవి

జగనన్నకు చెబుదాం వాయిదా

దుత్తలూరు: మండల కార్యాలయంలో శుక్రవారం నిర్వహించ తలపెట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం వాయిదా పడినట్లు ఎంపీడీఓ సాయిప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని పరిపాలనా కారణాల దష్ట్యా ఈ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు తెలిపారు. తదుపరి నిర్వహించే తేదీని ప్రకటిస్తామని తెలిపారు. అధికారులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు.

వైభవంగా కుంభాభిషేక మహోత్సవాలు



విగ్రహాల గ్రామోత్సవంలో అయ్యప్పల భజనలు

సంగం: సంగంలో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయంలో కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం శ్రీహరి హరపుత్ర అయ్యప్పస్వామితో పాటు వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, మాలికాపురత్తమ్మ, వేణుగోపాలస్వామి విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు గ్రామోత్సవంలో భజనలు చేశారు.

పీహెచ్‌సీలో డీఎంహెచ్‌ఓ తనిఖీ



వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

మర్రిపాడు: మర్రిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం డీఎంహెచ్‌ఓ పెంచలయ్య తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో ప్రజలకు వర్షాకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులకు పలు సూచనలు తెలియజేశారు. ప్రభుత్వాస్పత్రిలో రికార్డుల నిర్వహణ అంశాలపై ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు గోపినాథ్, శాంతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుర్రపు డెక్క తొలగింపు



జేసీబీతో గుర్రపుడెక్కను తొలగిస్తున్న దృశ్యం

అల్లూరు: స్థానిక చెర్లోసంఘం కలుజు గేట్ల వద్ద పెద్ద ఎత్తున పెరిగిన గుర్రపు డెక్కను స్థానిక నాయకుడు షేక్ ఉస్మాన్ షరీఫ్ బుధవారం జేసీబీతో తొలగించారు. అల్లూరు చెరువుకు నీటిని విడుదల చేయగా ఆ నీరు చెరువులోకి చేరకుండా పంట పొలాల్లోకి చేరుతోంది. దీంతో నారుమళ్లు పోసుకున్న రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జేసీబీతో గుర్రపు డెక్కను కొంత మేర తొలగించారు. ఇరిగేషన్ అధికారులు త్వరితగతిన పూర్తిస్థాయిలో గుర్రపు డెక్కను తొలగించి నీటిని చెరువుకు చేరే విధంగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

యువ ఓటర్ల చేర్పులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

• కలెక్టర్ హరినారాయణన్

ఉదయగిరి: జిల్లాలో 18, 19 ఏళ్ల వయస్సు ఉండే యువకులను ఓటర్లుగా చేర్చుకునే విధంగా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరి నారాయణన్ ఆదేశించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో బుధవారం ఓటర్ల జాబితా పునర్ వ్యవస్థీకరణపై ఉదయగిరి నియోజకవర్గ ఈఆర్వో, ఏఈఆర్వోలతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జనాభాకు సరైన నిష్పత్తిలో ఓటర్లు ఉండాలన్నారు. ఓటు హక్కు లేని వారికి నమోదు చేసే కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలన్నారు. బీఎల్వోలు, సూపర్ వైజర్లు ఇంటింటికీ తిరిగి కొత్త ఓటర్లను చేర్పించాలని సూచించారు. కళాశాలలు, ముఖ్యమైన కూడళ్లలో ఓటర్ల చేర్పుపై ప్రత్యేక సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. కొత్తగా నమోదయ్యే ఫారం-6, 7, 8లను తక్షణమే పరిష్కరించాలన్నారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు పాటిస్తూ ఓటర్ల జాబితా చేపట్టాలన్నారు. ఓట్ల నమోదు ప్రక్రియలో, జాబితా సవరణలో నిర్లక్ష్యం వహిస్తే బీఎల్వోలు, సూపర్ వైజర్లు, సంబంధిత అధికారులపై ఎన్నికల కమిషన్‌కు నివేదిక పంపి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఉదయగిరి నియోజకవర్గ ఈఆర్వో ప్రేమ్‌కుమార్, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సూపర్‌వైజర్లు, బీఎల్వోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

పారదర్శకంగా కులగణన



ఆత్మకూరురూరల్: కులగణన సర్వేపై మాట్లాడుతున్న ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్



సీతారామపురంలో కులగణనపై శిక్షణ నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరురూరల్: కులగణన సర్వే పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సచివాలయాల సిబ్బంది, వలంటీర్లకు కుల గణన సర్వేపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సున్నితమైన సామాజిక అంశాలకు సంబంధించిన సర్వేను జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. ఎవరైనా కుటుంబ సభ్యులు అందుబాటులో లేకుంటే ఫోన్‌లో వచ్చే ఓటీపీ ద్వారా వారి సమాచారం నమోదు చేయవచ్చన్నారు. ఈ నెల 27 నుంచి డిసెంబరు 3వ తేదీలోగా సర్వే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ ఉషారాణి, ఉపాధి హామీ ఏపీఓ శిరీషా, వెలుగు ఏపీఎం వెంకాయమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నయోమి తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి కుల గణన సర్వే

సోమశిల: ఈ నెల 27 నుంచి అనంతసాగరం మండలంలో కుల గణన జరగనుందని ఎంపీడీఓ తెలిపారు. ముందుగా ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో గురువారం నుంచి 16 సచివాలయాల్లో సిబ్బందికి, గ్రామ వలంటీర్లకు శిక్షణ జరగనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 25 వరకు శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతాయని వివరించారు.

కులగణనపై శిక్షణా తరగతులు

సీతారామపురం (ఉదయగిరి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేపై బుధవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు కులగణన యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సర్వేను పక్కాగా నిర్వహించాలన్నారు. ఈ నెల 27 నుంచి కులగణన సర్వే ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ భార్గవి, పంచాయతీరాజ్ ఏఈ బాలినేని ప్రవీణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రోగులతో స్నేహ పూర్వకంగా వ్యవహరించాలి

• డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్

ఉదయగిరి: జిల్లాలోని సామాజిక ఆరోగ్య కేంద్రాలకు వైద్య సేవల కోసం వచ్చే రోగులతో వైద్య సిబ్బంది స్నేహ పూర్వకంగా మెలగాలని సామాజిక ఆరోగ్య కేంద్రాల జిల్లా సమన్వయకర్త రమేష్‌నాథ్ అన్నారు. ఆయన బుధవారం పట్టణంలోని సీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలందించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలకు ఎక్కువగా పేద ప్రజలు వైద్యసేవల కోసం వస్తుంటారన్నారు. వారిని ఆప్యాయంగా పలుకరించి సేవలందించినప్పుడే మంచి గుర్తింపు వస్తుందన్నారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. వైద్యశాల క్రమేణ అభివృద్ధి చెందుతుందోన్నారు. వైద్యశాలలో సిబ్బంది, వైద్యులు, పరికరాలు, మందులు అందుబాటులో ఉన్నాయని, ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యశాలలో సిబ్బంది వర్గ విభేదాలు విడనాడి సమన్వయంతో పని చేయాలన్నారు. సామాన్య రోగి ఇబ్బంది పడకూడదని, వారికి మెరుగైన సేవలందించడమే మన లక్ష్యమన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. వైద్యులు, సిబ్బంది బాధ్యతగా పని చేయాలన్నారు. అందరి సహకారంతో వైద్యశాలను ఏ-గ్రేడ్‌లో నిలిపేందుకు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి డీడీఓ అనీస్ సల్మా, వైద్యాధికారి ఠాగూర్, తదితరులున్నారు.



వైద్యులు, సిబ్బందికి సూచనలిస్తున్న డీసీహెచ్‌ఎస్

వైఎస్సార్‌సీపీ నేతలకు ఎమ్మెల్యే మేకపాటి పరామర్శ

సంగం: మండలంలో పలువురు వైఎస్సార్‌సీపీ నేతలను ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. మండలంలోని దువ్వూరులోని మాజీ జెడ్పీటీసీ ఎం.దేవసహాయం నివాసానికి వెళ్లి ఎమ్మెల్యే ఆయన్ను పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మర్రిపాడులోని మండల జేసీఎస్ కన్వీనర్ ముడి మల్లికార్జునరెడ్డిని పరామర్శించారు. ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో యువత, రైతులతో కాసేపు ముచ్చటించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు పులగం శంకర్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ కంటాబత్తిన రఘునాథ్‌రెడ్డి, దువ్వూరు పీఏసీఎస్ అధ్యక్షుడు సూరి మదన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మాజీ మండల ప్రచార కమిటీ అధ్యక్షుడు మెట్టుకూరు వాసుదేవరెడ్డి, గుండాల బాలచంద్రారెడ్డి, మర్రిపాడు సర్పంచ్ సురేష్ తదితరులు ఉన్నారు.



జేసీఎస్ కన్వీనర్ ముడి మల్లికార్జునరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

శిథిల పాఠశాల స్థానంలో నూతన భవనం

• డీఈఓ గంగాభవాని

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం ప్రాథమిక పాఠశాల శిథిల భవనం స్థానంలో నూతన భవనాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటానని జిల్లా విద్యాశాఖాధికారి గంగాభవాని చెప్పారు. బుధవారం ఆమె శిథిలమైన పాఠశాల భవనాన్ని పరిశీలించారు. విద్యార్థుల వర్క్‌బుక్‌లు, ప్రగతిని పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలందించారు. అనంతరం ఉదయగిరి ఎంఈఓ కార్యాలయంలో సచివాలయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ప్రధానంగా గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో, బడిబయట పిల్లలు, పాఠశాలల వసతులు, తదితర అంశాలపై సమీక్షించారు. ఐదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ బడిలో ఉండేలా చూడాలన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండాలన్నారు. ఆమె వెంట ఎంఈఓ మస్తాన్‌వలి, గండిపాళెం పాఠశాల హెచ్‌ఎం జాఫర్‌సాహెబ్ ఉన్నారు.



గండిపాళెంలో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న డీఈఓ గంగాభవాని

కులగణన సర్వే బాధ్యతగా పూర్తి చేయండి

• మున్సిపల్ కమిషనర్ బి నాగేశ్వరరావు

ఆత్మకూరు: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీలోని 8 సచివాలయాల పరిధిలోని కులగణన సర్వే నిర్వహించాల్సి ఉందని, దీనికి అధిక ప్రాధాన్యత ఇస్తూ బాధ్యతగా సర్వే పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ బల్లి నాగేశ్వరరావు అన్నారు. తన కార్యాలయంలో ఎంజీఆర్ సమావేశ మందిరంలో బుధవారం సచివాలయాల సిబ్బంది, వలంటీర్లతో కులగణన సర్వేపై రెండు బ్యాచ్‌లుగా శిక్షణా సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రత్యేక యాప్ ద్వారా వలంటీర్లు సర్వే నిర్వహించే క్రమంలో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. సంక్షేమ పథకాల అమలుకు ఈ కులగణన సర్వేకు ఎలాంటి సంబంధం లేదని ప్రజలకు తెలియజేయాలన్నారు. 27వ తేదీ నుంచి సర్వే ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఐ ఖాసీం, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



కులగణన సర్వే శిక్షణలో మాట్లాడుతున్న కమిషనర్ నాగేశ్వరరావు